క్లుప్తంగా

పకడ్బందీగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



ఎమ్మెల్యే తిప్పేస్వామికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మడకశిర: జగనన్న ఆరోగ్య సురక్షపై పట్టణంలోని ఆదిరెడ్డిపాళ్యంలో గురువారం సర్వే జరిగింది. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటికి వెళ్లి ఆయనకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఇంటింటా సర్వే ఎలా జరుగుతోందని ఎమ్మెల్యే వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రత్యేక వైద్య శిబిరంలో అవసరమైన రోగులకు వైద్య చికిత్సలు అందించాలని కోరారు.

సేంద్రియ ఎరువులే మేలు

మడకశిర రూరల్: రసాయన ఎరువులు, పురుగు మందులను వాడకుండా సహజసిద్ధమైన సేంద్రియ ఎరువుల ద్వారా పండ్లతోటలు సాగు చేసుకోవాలని ఎకార్డ్ కోఆర్డినేటర్ శంకర్ తెలిపారు. ఆర్.అనంతపురం ఆర్డీటీ కార్యాలయంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో గురువారం రైతులకు ఎకార్డ్ ప్రోగ్రామ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. భూమిలో కర్బన శాతం పెంచుకునే విధానంపై అవగాహన కల్పించారు.

మైనార్టీల సంక్షేమానికి జగనన్న కృషి



ఇలియాజ్‌ను అభినందిస్తున్న నాయకులు

హిందూపురం: మైనార్టీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన ఇలియాజ్ అన్నారు. మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం ఇలియాజ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

వాల్మీకి గర్జనకు తరలిరండి



సమావేశంలో పాల్గొన్న పులి శ్రీనివాసులు, నాయకులు

హిందూపురం టౌన్: అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద అక్టోబర్ 8న జరగనున్న వాల్మీకి గర్జన మహాసభకు పెద్ద సంఖ్యలో వాల్మీకులు తరలిరావాలని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఆయన పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమానత్వం, విద్య, వైద్య రంగాల్లో వాల్మీకులకు ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్లతో ఈ సభ జరుగుతుందన్నారు.

విద్యార్థిని మృతి

రొద్దం: గౌరాజుపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్ పెద్ద కూతురు భార్గవి(8) అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. మెదడులోని నరాల్లో రక్తం గడ్డకట్టడంతో కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు వివరించారు. బాలిక గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నట్లు తెలిపారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి



గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెనుకొండ: సమాజంలో అసమానతలపై గుర్రం జాషువా తన రచనల ద్వారా పోరాటం చేశారని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు శివరామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఆవేదిక ఆధ్వర్యంలో పద్మభూషణ్ గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సమాజానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఎంపీటీసీ సభ్యుడికి పరామర్శ

సోమందేపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది చెన్నాపురంలోని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీటీసీ నాగప్పను గురువారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్న పరామర్శించారు. మాజీ సర్పంచ్ లక్ష్మి నరసప్ప పాల్గొన్నారు.

ప్రవక్త జన్మదినం..వెల్లివిరిసిన భక్తిభావం

మిలాద్ ఉన్ నబీ వేడుకలు ముస్లిం సముదాయంలో భక్తిభావాన్ని నింపాయి. మడకశిర, హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లో మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబీ వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే స్నానాలు ఆచరించి కొత్త దుస్తులు ధరించి ఊరేగింపుగా మసీదులు, దర్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బంధువులు, స్నేహితులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మసీదుల్లో జరిగిన ప్రార్థనల్లో పండుగ విశిష్టతను, ప్రవక్త జీవితం, బోధనలను మత పెద్దలు వివరించారు. ప్రవక్త చూపిన మార్గంలో నడుచుకోవాలని సూచించారు.



పెనుకొండ: ముస్లింల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ



హిందూపురంలో ముస్లింల ర్యాలీ

పెనుకొండ: ప్రపంచ శాంతి కోసం మానవాళికి విలువైన సందేశాలు ఇచ్చిన మహోన్నత వ్యక్తి మహమ్మద్ ప్రవక్త అని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. గురువారం జరిగిన మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. అల్లా దీవెనలు రాష్ట్రంపై, ప్రజలపై చల్లగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు న్యామతుల్లా, ముహీబా పాల్గొన్నారు.

హిందూపురం: హిందూపురంలో జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు రహమత్‌పురం సున్ని యువజన కమిటీ, ముక్కిడిపేట గౌసియా మసీదు, మేళాపురం జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో మక్కా మదీనా నమూనాలతో ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు రహమతుల్లా సేట్, ఫారూఖ్ సేట్ మాట్లాడుతూ ప్రవక్త విశ్వానికి శుభం కల్గించాలని భువిపైకి విచ్చేసిన మహనీయులన్నారు. ప్రతి ఒక్కరూ కల్మా, నమాజ్, జకాత్, సిత్రా, హజ్‌ను పాటించాలన్నారు. దాతలు విశ్రాంత టెలిఫోన్ ఉద్యోగి మహబూబ్ దౌలా, ఆర్ఎంఎస్‌షాషీలు మిఠాయిలు, అల్పాహారాన్ని పంపిణీ చేశారు. మౌలానా, మతవల్లీలు షాషిద్ రజాక్, అబ్దుల్‌రజాక్, రహంతుల్లా, అమానుల్లా, దాదాపీర్, సాధిక్, సయ్యద్‌షాబుద్దీన్, నజీర్, బాబాఫక్రుద్దీన్, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: అమరాపురం, హేమావతి గ్రామాల్లో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లింలు మదీనా, చాందీని చిత్ర పటాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో కూర్చొబెట్టి ఊరేగింపు నిర్వహించారు.

పావగడ: పట్టణంలో ముస్లింలు భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఈద్గా మైదానానికి చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు.

రొళ్ల: మండలంలోని దొడ్డేరి, రత్నగిరి గ్రామాల్లో ముస్లింలు ఈద్ మిలాద్ ఉన్ నబీ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈద్గా మైదానానికి వెళ్లి ప్రార్థనలు చేశారు.



మక్కా మదీన మసీదు నమూనాలతో ఊరేగింపు



అమరాపురంలో ఊరేగింపు



పావగడలో ముస్లింల ర్యాలీ



పరిగి: శ్రీరంగరాజుపల్లిలో ముస్లింల ఊరేగింపు

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లపై నేడు సమీక్ష

హిందూపురం: 'జగనన్న ఆరోగ్య సురక్షతోపాటు ఏపీకి ఎందుకు జగనే సీఎం కావాలి' అనే కార్యక్రమాలపై శుక్రవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అధ్యక్షతన స్థానిక పార్టీ కార్యాలయంలో మండలాల వారీగా సమావేశాలు జరుగుతాయని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. 29న ఉదయం 10గంటలకు హిందూపురం మండల సమావేశం, మధ్యాహ్నం 12గంటలకు చిలమత్తూరు మండలం, మధ్యాహ్నం 2 గంటలకు లేపాక్షి మండలం, సాయంత్రం 4గంటలకు హిందూపురం పట్టణ సమావేశం జరుగుతుంది. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, మండల కమిటీ కన్వీనర్లు, డైరెక్టర్లు, సర్పంచులు పాల్గొనాలని కోరారు.

మండలంలో మోస్తరు వర్షం

మడకశిర రూరల్: మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. మండల కేంద్రంలో రహదారులు జలమయం అయ్యాయి. కాగా ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం



గణేష్ ప్రతిమను నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం

రొళ్ల: ఎం.రాయపురంలో కొలువైన గణేష్ ప్రతిమకు గురువారం ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు.

బీసీ కులగణనపై చర్చించడం శుభపరిణామం

• వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక



హిందూపురం: బీసీ కుల గణనపై శాసనసభ సమావేశాల్లో చర్చించడం శుభపరిణామమని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీఎన్.దీపిక పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారని చెప్పారు. బీసీలు ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధికి కులగణన చేయాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉందన్నారు. ఈ తరుణంలో బీసీ కులగణన ప్రభుత్వమే చేపట్టాలని నిర్ణయించడం సంతోషకరమని చెప్పారు. ఇప్పటికే బీసీ కులాలకు జగనన్న ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేసిందన్నారు. బీసీ కుల గణనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న సీఎం జగన్, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణలకు బీసీ వర్గాల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వివరించారు.

భగత్‌సింగ్ జీవితం యువతకు స్ఫూర్తి

హిందూపురం టౌన్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. స్థానిక ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో గురువారం భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఎంజీఎం పాఠశాల వద్ద భగత్‌సింగ్ విగ్రహానికి లైఫ్ వరల్డ్ ట్రస్ట్ ప్రతినిధి ఉదయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాష్ గాంధీ, నవీన్, శ్రీరాములు, నవీన్, చైతన్య గంగిరెడ్డి, రాజారెడ్డి, అనిల్, మురళీ దేశాయ్, శివ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ ఆలోచనలు, ఆశయాలు ఎంతో మంది యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.



భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి: మండలంలోని సేవామందిరం బీసీ హాస్టల్‌లో భగత్‌సింగ్ జయంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా ఆచరించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి హర్షకుమార్ పాల్గొన్నారు.

హనుమాన్ ఏకశిల విగ్రహ నిర్మాణానికి ముందడుగు

హిందూపురం: పట్టణంలోని సూగూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠ చేయనున్న అభయాంజనేయస్వామి విగ్రహాన్ని మల్చించేందుకు చర్యలు చేపట్టారు. ఈమేరకు గురువారం సూగూరు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఏక శిలను కర్ణాటకలోని సాగర ప్రాంతానికి చెందిన నేషనల్ అవార్డు పొందిన గౌతం గుడిగార్ నిర్మాణ సంస్థకు అప్పగించారు. ఈ సందర్భంగా విగ్రహ దాత వైసీ చంద్రశేఖర్ రూ.5 లక్షలను నిర్మాణ సంస్థకు అడ్వాన్సుగా అందించారు. నాయకులు చారుకీర్తి, రాయల్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ బృహత్ దైవకార్యానికి దాతలు సహకరించాలని కోరారు. కాగా అయోధ్య, మంత్రాలయంలో 108 అడుగుల రాముడి విగ్రహాలను నిర్మిస్తున్నది కూడా పై నిర్మాణ సంస్థే.



అభయాంజనేయస్వామి ఏకశిల విగ్రహాన్ని మలిచే బాధ్యతలను శిల్పికి అప్పగిస్తున్న దృశ్యం

గో సంరక్షణకు అధికారుల చర్యలు

హిందూపురం అర్బన్: పట్టణ శివారు ప్రాంతాల్లో అక్రమంగా గోవులను వధించి వాటి మాంసాన్ని బెంగళూరుకు తరలిస్తుండగా మూడు రోజుల క్రితం దొడ్డబళ్లాపురలో భజరంగదళ్ కార్యకర్తలు అడ్డుకొని ఒక వాహనాన్ని తగల బెట్టారు. అప్రమత్తమైన పోలీస్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పట్టణంలో గో సంరక్షణకు చర్యలు చేపట్టారు. అనుమతులు లేకుండా గో మాంసం విక్రయించే దుకాణాలను గురువారం మూసివేయించారు. గో సంరక్షణపై ఆదివారం హిందూ సురక్ష ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ చేపడుతున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, మున్సిపల్ అధికారులు ఇప్పటి నుంచే చర్యలకు ఉపక్రమించారు. డీఎస్పీ కంజాక్షన్ మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా గోవులను వధించి మాంసం విక్రయిస్తున్న దుకాణాలకు సంబంధించి మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందించామన్నారు. కమిషనర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ కొన్ని శివారు ప్రాంతాల్లో గోవులను వధిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటున్నామన్నారు.



రహమత్‌పూర్‌లో గోమాంసం విక్రయ దుకాణాలను మూసివేయిస్తున్న దృశ్యం

అనంతపద్మనాభస్వామికి విశేష పూజలు

హిందూపురం: అనంత చతుర్దశిని పురస్కరించుకొని రైల్వేరోడ్డులోని అనంత పద్మనాభ స్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం చేసి విశేషంగా అలంకరించి పూజలు, హోమాలు నెరవేర్చారు. సాయంత్రం వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులను అలంకరించి ఉయ్యాలోత్సవం ఆచరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఈవో, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



అనంత పద్మనాభస్వామికి వివిధ రకాల పుష్పాలతో అలంకరణ

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి

• ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: మళ్లీ జగనన్నే సీఎం కావాలన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే శంకరనారాయణ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లతో సమావేశమై మాట్లాడారు. ప్రతి సచివాలయ పరిధిలో పార్టీ జెండా కట్ట ఏర్పాటు చేయాలన్నారు. రాత్రిళ్లు అక్కడే నిద్రించి ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి మార్గం చూపాలన్నారు. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ఏకతాటిపై నడవాలన్నారు. చిన్న చిన్న మనస్పర్థలు, విభేదాలు ఉంటే పక్కన పెట్టాలన్నారు. ఈ నాలుగేళ్లలో సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేయాలన్నారు. లబ్ధిదారుల వివరాలతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలన్నారు. చంద్రబాబు మోసాలు, వంచనలను ప్రజలకు వివరించడంతోపాటు సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చిన విషయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. 'అపు బాబూ నీ నాటకం–జగనన్నే మానమ్మకం' అనే నినాదాన్ని గ్రామాల్లో వివరించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నవంబర్ 11లోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. గృహ సారథుల నియామకంలో పెనుకొండ టౌన్, సోమందేపల్లి, పరిగి మండలాలు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాయన్నారు. పార్టీ కన్వీనర్లు నాగలూరుబాబు, బోయనరసింహ, తిమ్మయ్య, నారాయణరెడ్డి, జెడ్పీటీసీలు డీసీ అశోక్, గుట్టూరు శ్రీరాములు, ఎంపీపీలు గీత, చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, రాష్ట్ర నాయకులు నారాయణరెడ్డి, ముఖ్యనాయకులు శంకరరెడ్డి, వెంకటరత్నం, నారాయణరెడ్డి, శంకర్, ఉపసర్పంచ్ వేణు, లక్ష్మీనరసప్ప, సమర, మార్కెట్‌యార్డ్ చైర్మన్లు బూదిలి వేణుగోపాలరెడ్డి, కలిపి శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో అందరికీ ఆరోగ్యం

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేలా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ పేదలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్ ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేశారన్నారు. దానికి కొనసాగింపుగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 31 వరకు పీహెచ్‌సీల పరిధిలోని విలేజ్ హెల్త్ సెంటర్స్, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ సెంటర్స్‌లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సర్వేలో గుర్తించిన వారికి వైద్యం అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు.

స్వామినాథన్ మృతి దేశానికి తీరనిలోటు

మడకశిర: హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతికి సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్ రఘువీరారెడ్డి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని తెలిపారు. వ్యవసాయ అభివృద్ధికి, దేశంలో ఆహార కొరతను నివారించడానికి మేలైన వరి వంగడాలను సృష్టించారని తెలిపారు. ఆయన మృతి దేశానికి తీరని లోటన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు గడువు పెంపు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ కేశవరావు గురువారం తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్స్, బీకాం కంప్యూటర్స్, జనరల్, హిస్టరీ, జువాలజీ గ్రూపుల్లో మిగిలిన సీట్ల కోసం ఈనెల 29వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలి

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి గ్రామంలో దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సోమందేపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దాడులకు నిరసనగా అక్టోబర్ 3న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు నాయకులు పెద్దన్న, గంగాధర్, హనుమయ్య, నరసింహ మూర్తి తెలిపారు.

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం ఎంపిక

గోరంట్ల: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) మండల కార్యవర్గాన్ని గురువారం ఎంపిక చేశారు. అధ్యక్షునిగా సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా సిరాజుద్దీన్, గౌరవాధ్యక్షుడిగా ఈశ్వరప్రసాద్, జిల్లా కౌన్సిలర్లుగా సూర్యనారాయణ రెడ్డి, ఆదినారాయణ, రామచంద్రప్ప, పక్కీరనాయక్, నంజప్ప అనసూయ, ఉపాధ్యక్షులుగా రవీంద్రరెడ్డి, వెంకటేష్, సుధాకర్, వెంకటేశులు, బాలకృష్ణను ఎన్నుకున్నారు. నేతలు కోనంకి అశోక్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన జెడ్పీటీసీ

రొళ్ల: మండల పరిధిలోని దాసప్పపాళ్యం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాస్ సోదరుడు మంజునాథ (38) గురువారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు వెళ్లి మంజునాథ్ భౌతికకాయానికి నివాళులర్పించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పరిగి: పెద్దిరెడ్డిపల్లికి చెందిన ఇందూ(20) అనే వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. ఆమె గత బుధవారం కుమార్తెతో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన తల్లి దమయంతి తమకు ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



కృష్ణప్పను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న కాళప్పగారి కృష్ణప్పను ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గురువారం తన క్యాంప్ కార్యాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు, ఎంపీపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

గుడిబండ: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా ఎన్నికైన సి.సి.గిరి గ్రామానికి చెందిన డి.ఎల్.యంజారేగౌడు గురువారం మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామిని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. యంజారేగౌడు మాట్లాడుతూ తన ఎంపికకు కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నారాయణకు, ఎమ్మెల్యే తిప్పేస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.